క్లుప్తంగా

నేడు ప్రజాప్రతినిధులకు శిక్షణ

నంద్యాల(అర్బన్): మండల ప్రజాప్రతినిధులకు శనివారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025–26పై శిక్షణా కార్యక్రమానికి మొదటి బ్యాచ్ కింద అయ్యలూరు, భీమవరం, బిల్లలాపురం, చాబోలు, చాపిరేవుల, కానాల, కొత్తపల్లె, మిట్నాల, పాండురంగాపురం, రెండవ బ్యాచ్ కింద పెద్దకొట్టాల, పోలూరు, పులిమద్ది, పుసులూరు, రాయమాల్పురం, బ్రాహ్మణపల్లె, గుంతనాల, మునగాల గ్రామాల ప్రజాప్రతినిధులు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. పీఆర్ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఏపీఎం(సెర్ప్), ఏపీఓ, వెటర్నరీ అసిస్టెంట్, పీహెచ్‌సీ డాక్టర్స్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వ్యవసాయాధికారి శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక గ్రామైక్య సంఘం(వీఓ)లను సమావేశానికి తీసుకురావాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



తుడుమలదిన్నెలో క్యాన్సర్ స్క్రీనింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

ఉయ్యాలవాడ: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా వైద్యాధికారి కామేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని మాయలూరు ఆరోగ్య కేంద్రం పరిధిలోని తుడుమలదిన్నె గ్రామంలో జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు గృహ పరిసరాలతో పాటు గ్రామంలో ఉన్న మురుగు కుంటలను శుభ్రపరచుకోవాలని సూచించారు. మురుగు కుంటల్లో దోమలు చేరడం ద్వారా మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యాధికారి రాబర్ట్ కెనడీ, సబ్‌యూనిట్ ఆఫీసర్ విశ్వనాథ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



రాతన అమల (ఫైల్)

డోన్ రూరల్: మండల పరిధిలోని సోంపురం గ్రామానికి చెందిన రాతన అమల (42) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ మమత తెలిపారు. అక్టోబర్ 28న అమలు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ నెల 3న ఆమె భర్త ఆనందరెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవ వైభవంగా సాగింది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కోవెలకుంట్ల: రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో మట్కాబీట్ నిర్వహిస్తున్న ఇద్దరిని శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. కోవెలకుంట్లకు చెందిన చాంద్‌బాషా, రేవనూరుకు చెందిన సురేష్ గౌడ్ మట్కా నిర్వహిస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి మట్కా చీటీలు, రూ. 1.43 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వాహనం ఢీకొని ఆర్టీసీ మెకానిక్ దుర్మరణం



ఎల్లయ్య (ఫైల్)

నంద్యాల: మండలంలోని మిట్నాల గ్రామానికి చెందిన ఆర్టీసీ మెకానిక్ ఎల్లయ్య (49) శుక్రవారం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జునగుప్త తెలిపారు. ఎల్లయ్య కర్నూలు ఆర్టీసీ గ్యారేజీలో మెకానిక్‌గా పనిచేస్తున్నారు. మిట్నాల నుంచి నంద్యాలకు బైక్‌పై వచ్చి ఆర్టీసీ బస్సులో కర్నూలుకు విధులకు వెళ్లేవారు. అయితే శుక్రవారం నంద్యాల నుంచి బైక్‌పై తన స్వగ్రామం మిట్నాలకు వెళుతుండగా కాంత్రినగర్‌లోని శాంతినికేతన్ పాఠశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తమ్ముడు ఎల్లప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



నవనందుల పాదయాత్ర చేపట్టిన భక్తులు



రోజాకుంట నాగలింగేశ్వరాలయంలో జ్వాలాతోరణం వెలిగిస్తున్న భక్తులు

సర్వం శివోహం

నంద్యాల(వ్యవసాయం): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం నంద్యాలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా మన ఊరు మన గుడి–మన బాధ్యత ఇన్‌టాక్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన నవనందుల పాదయాత్ర వైభవంగా జరిగింది. స్థానిక ప్రథమనంది దేవస్థానంలో అత్యంత భక్తిశ్రద్ధలతో వేలాది మంది భక్తులు శివనామస్మరణతో యాత్ర ప్రారంభించారు. ముందుగా ఆధ్యాత్మికవేత్తలు రాధామనోహర్ దాస్ స్వామిజీ, కమలానంద భారతి స్వామిజీలు ఉపన్యాసం ఇచ్చారు. పాదయాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొనగా కేరళ వాయిద్యాలు, కోలాటాలు, చెక్కభజనలు, బసవన్నలు, ఎద్ల బండ్లతో శివనామ స్మరణ చేస్తూ ప్రథమనంది మీదుగా ఆంజనేయస్వామి దేవస్థానంలోని నాగనంది, సోమనంది, మహానంది చేరుకున్నారు. పట్టణంలోని భక్తులు పూలు చల్లి నీరాజనాలు, మంగళ హారతులు ఇచ్చి సాగనంపారు. భక్తులకు హిందూ ధార్మిక సంస్థలు, ఆర్యవైశ్య సంఘం, శ్రీకాళికాంబ సేవా సమితి సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు అల్పాహారం, మంచి నీరు, మజ్జిగ ఉచితంగా అందజేశారు.

జ్వాలాతోరణం.. సకల పుణ్యఫలం

నంద్యాల(వ్యవసాయం): కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని శైవ దేవాలయాల్లో అభిషేకాలు, పంచామృతాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం జ్వాలాతోరణ కార్యక్రమం, సహస్ర దీపోత్సవం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు.



ప్రథమనంది క్షేత్రంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

- భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. కాశీ విశ్వనాథునికి, విశాలాక్షి అమ్మవారికి ప్రత్యేక పూజలు సాయంత్రం నిర్వహించి సహస్ర దీపాలంకరణ సేవ, జ్వాలాతోరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాళికాంబ దేవస్థానంలో నక్షత్రాకారంలో సహస్ర దీపాలంకరణ,స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక నిర్వహించారు.
- మెయిన్ బజార్‌లోని అమ్మవారి శాలలో అధ్యక్షుడు భవనాశి వాసు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం సహస్ర దీపాలంకరణ నిర్వహించారు.
- కల్పసెంటర్ రామాలయంలో కాశీవిశ్వనాథుడికి సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి జ్వాలాతోరణం నిర్వహించారు.
- కల్పనా సెంటర్‌లోని రామాలయంలో భక్తుల ఆధ్వర్యంలో జ్వాలాతోరణం నిర్వహించారు. గుడిపాటిగడ్డలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో సహస్ర దీపాలంకరణ, నవనందుల పాదయాత్ర భక్తులకు మల్లికార్జునస్వామి దేవస్థానం, శివస్వాములకు గుడిపాటిగడ్డ రైతు సంఘం నాయకులు గుడిపాటి ప్రసాద్, మిద్దె సుబ్బయ్య ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు.
- స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని అమ్మాస్పటిక లింగేశ్వర ఆలయంలో లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించి సాయంత్రం సహస్ర దీపాలంకరణ, జ్వాలా తోరణం నిర్వహించారు.



ప్రత్యేక అలంకారంలో నాగలింగేశ్వరస్వామి



ప్రథమనంది క్షేత్రంలో మాట్లాడుతున్న స్వామిజీ కమలానంద భారతి స్వామి

ఘనంగా కార్తీక పౌర్ణమి



హోమగుండాల వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని శివాలయాల్లో శుక్రవారం కార్తీక పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. కొండమాయపల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మిగోదా సమేత వేంకటేశ్వర స్వామి, మహత్రిపుర సుందరి సమేత మానస లింగేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హోమ గుండాల వద్ద భక్తాదులు ఆశీనులు కాగా వేద పండితులు మంత్రోచ్చరణతో పూజలు చేయించారు. పూజా కార్యక్రమాల్లో ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, గంధం రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడలో శ్రీ అగస్త్యేశ్వర ఆలయం, ఆర్.జంబులదిన్నెలో చెన్నకేశవస్వామి, అభయాంజనేస్వామి ఆలయాల్లో పంచామృతాభిషేకాలు, కుంకుమ, సింధూర అర్చనలు, అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి వడిబియ్యం సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శిరివెళ్ల: స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు గౌరీ వ్రతం చేశారు. శైవ పుణ్యక్షేత్రాలు మహానంది, శ్రీశైలం, యాగంటికి తరలివెళ్లి పూజలు చేశారు.

దొర్నిపాడు: మండలంలోని అన్ని శివాలయాల్లో మహిళలు దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. క్రిష్టిపాడు గ్రామంలో మహిళలు వేకువజామున్నే కుందూనది స్నానాలు చేసి నదిలో కార్తీక దీపాలు వదిలారు.

కల్యాణం.. కమనీయం

చాగలమర్రి: మండలంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో రాత్రి నిర్వహించిన జ్వాలాతోరణం కార్యక్రమంలో అశేష భక్తజనం పాల్గొన్నారు. చింతలచెరువు గ్రామ సమీపంలోని భైరవ గుండాల వద్ద ఉన్న శివాలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ పూజ, క్షేత్ర పాలక భైరవ పూజ, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మధ్యాహ్నం మాధ్యహ్నిక కాలపూజ, తీర్థ ప్రసాద వితరణ సాయంత్రం అమ్మవారికి అభిషేకం, విశేష అలంకారం, రాత్రి జ్వాలా తోరణం కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది.

అహోబిలంలో కార్తీక పౌర్ణమి పూజలు

ఆళ్లగడ్డ: అహోబిలం లక్ష్మినరసింహ స్వామి ఆలయంలో ఉదయం మూలమూర్తులకు నిత్యపూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వాములను ఆలయం ముఖద్వారం మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించి దూపదీపాలతో మహామంగళహారతి అనంతరం నైవేద్యం నివేదించారు. రాత్రి విశేషాలంకరణలో స్వామి ఉభయ దేవేరులతో కొలువుదీరి మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. తిరిగి దేవాలయం చేరుకున్న అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యాక్రమాన్ని ముగించారు



వాసాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి



కుందూనదిలో కార్తీక దీపాలను వదులుతున్న మహిళలు



చాగలమర్రిలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో జ్వాలాతోరణంలో పాల్గొన్న భక్తులు



భైరవ గుండాల శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం

ముందు సర్వే తర్వాతే ఆధార్ సేవలు

- ఈఓ తీరుతో ప్రజలకు ఇబ్బందులు

రుద్రవరం: స్థానిక గ్రామ సచివాలయంలో ఆధార్ సేవలందించడం లేదని గదమాయిస్తూ ఈఓ సుబ్బారావు ప్రజలను వెనక్కు పంపించేశారు. ప్రస్తుతం సచివాలయ సిబ్బంది జియో ట్యాగింగ్ పనిలో ఉన్నారని, సర్వే పూర్తయ్యే వరకు ఆధార్ క్యాంప్ నిర్వహించలేమని చెప్పడంతో చేసేదిలేక ఆధార్ సేవల కోసం వచ్చిన ప్రజలు వెనుదిరిగివెళ్లారు. మండలంలోని నర్సాపురం, రుద్రవరం, కోటకొండ గ్రామ సచివాలయాల్లో నిరంతరం ఆధార్ సేవలు అందించేలా గతంలో చర్యలు తీసుకున్నారు. అయితే నర్సాపురం, కోటకొండ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల సమస్య ఉండటంతో సేవలు అందడం లేదు. రుద్రవరంలో మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి. దీంతో మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలోని ప్రజలు రుద్రవరానికి వచ్చి పనులు చేయించుకొని వెళ్తున్నారు.ఈ క్రమంలో ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని ఆదేశించడంతో సచివాలయ సిబ్బంది ఆ పనుల్లో నిమగ్నమయ్యారు. డిజిటల్ అసిస్టెంట్ మాత్రం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆధార్ సేవలందించి ఆపై సర్వేకు వెళ్లేవారు. ఈ స్థితిలో సర్వే గడువు ముగుస్తోందని సిబ్బంది అందరూ సర్వేకు వెళ్లాలని ఈఓ ఆదేశించారు. ప్రభుత్వం మరో పది రోజులు గడువు పెంచిన విషయాన్ని పట్టించుకోకుండా ఆధార్ క్యాంప్‌ను మూయించేశారు. అక్కడున్న స్థానికులతో పాటు చిన్నకంబలూరు, అప్పనపల్లె గ్రామాల ప్రజలు.. తాము చాలా దూరం నుంచి పనులు మానుకుని ఆధార్ సేవల కోసం వచ్చామని చెప్పగా.. అదంతా నాకు తెలియదు.. ఎవరికైనా చెప్పుకోండి.. ముదు సర్వే చేయాల్సిందే అంటూ డిజిటల్ అసిస్టెంట్‌ను పంపించేశారు. దీంతో వచ్చిన వారు నిరాశగా ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ విషయంపై ఎంపీడీఓ భాగ్యలక్ష్మిని వివరణ కోరగా అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని, ప్రతి రోజూ మధ్యాహ్నం వరకు ఆధార్ క్యాంప్ నిర్వహించేలా చూస్తామని చెప్పారు.



రుద్రవరంలో ఆధార్ సేవల కోసం వచ్చిన వారిని వెనక్కు పంపుతున్న ఈఓ సుబ్బారావు

పుస్తక పఠనంతో మేధస్సు



ఉయ్యాలవాడ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన దృశ్యం

ఉయ్యాలవాడ: పుస్తక పఠనంతో మేధస్సు పెరుగుతుందని గ్రంథాలయాధికారిణి సంగీత లక్ష్మి అన్నారు. 57వ గ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల జీవితాలకు సంబంధించిన పుస్తకాలను చదివి వారి గురించి తెలుసుకోవాలని పాఠకులకు సూచించారు.



పుస్తకాలను చదువుతున్న పాఠకులు, విద్యార్థులు

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

నంద్యాల(వ్యవసాయం): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండవ రోజు స్థానిక పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో సిబ్బంది శ్రీధర్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పోటీ పరీక్షల పుస్తకాలు, దేశ నాయకుల జీవితచరిత్ర, బాలల సాహిత్యం, తదితర పుస్తకాలను పాఠకులు చదివారు. పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): కర్నూలు కోల్స్ కళాశాలలో ఈనెల 18న దివ్యాంగుల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సుకు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నంద్యాల జిల్లా అధ్యక్షులు గంగాధరశెట్టి కోరారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల పింఛన్‌ను రూ.200 నుంచి రూ.3 వేలు, తర్వాత రూ.6 వేలు, ప్రస్తుతం రూ.15 వేలు సాధించామంటే మందకృష్ణ మాదిగ చలువేనన్నారు. వికలాంగులకు బతుకు తెరువు చూపించిన మందకృష్ణ మాదిగ వస్తున్న సదస్సుకు నంద్యాల జిల్లా వికలాంగులందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

చాగలమర్రి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అభివృద్ధి కమిటీ సభ్యుడు, ఎంపీపీ వీరభద్రుడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌తో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారిణి అంజలి విధులకు గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారిణి సెలవుపై వెళ్లిన సమాచారాన్ని అక్కడే విధులు నిర్వహిస్తున్న వైద్యుడు ఇమ్రాన్, సిబ్బందికి తెలపకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఆమెపై జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా ఇప్పటికి 4 పర్యాయాలు విచారణ చేపట్టారని ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధి నిధులను కమిటీ సభ్యుల తీర్మానం లేకుండా కొంత మొత్తాన్ని వాడుకున్నారని, ఈ విషయమై త్వరలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ అన్నారు.



చాగలమర్రి పీహెచ్‌సీలో వైద్య సేవలపై చర్చిస్తున్న ఎంపీపీ వీరభద్రుడు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

అనారోగ్య సమస్యతో సెలవులో ఉన్నా..

వైద్యాధికారిణి పి.అంజలి ఫోన్ ద్వారా మాట్లాడుతూ.. తాను రెండు రోజుల నుంచి అనారోగ్యంతో వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అధికారులకు సమాచారం ఇవ్వటానికి కూడా అవకాశం లేదని, ఇక్కడి వైద్యులు 3 రోజుల పాటు బెడ్‌రెస్ట్ తీసుకోవాలని సూచించారని తెలిపారు.

నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్)/గోస్పాడు: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలాలు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం నిరుపేదలకు ఎలాంటి పథకాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి పాలనలో నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల రేట్లు విపరీతంగా పెరిగాయని, పేదలకు పట్టెడన్నం కూడా కరువయ్యే రోజులు వస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, ఖలీల్, కరీముల్లా, మద్దిలేటి, మద్దయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం



దొర్నిపాడులో ఒరిగిన కందిపంట

దొర్నిపాడు: మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి పత్తి, పొగాకు, కంది పంటలకు ఇబ్బంది కల్గించినా శనగ, మినుము, జొన్నపంటలకు మేలు చేసిందని రైతులు పేర్కొంటున్నారు. ఇంకొంచం వర్షం కురిసింటే బాగుండేదని రైతులు పేర్కొంటున్నారు. కంది, పత్తిలో కాయలు రాలిపోగా పొగాకు తోరణాలు తడిసి రైతులు నష్టపోయారు.

టిప్పర్ ఢీకొని మహిళ మృతి

నంద్యాల: నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన దస్తగిరమ్మ (39) అనే మహిళను టిప్పర్ ఢీకొనడంతో మృతి చెందినట్లు సీఐ మల్లికార్జున గుప్త తెలిపారు. కొత్తపల్లె గ్రామానికి చెందిన భార్యభర్తలు దూదేకుల మౌలాలి, దస్తగిరమ్మ శుక్రవారం బైక్‌పై నంద్యాలకు వస్తుండగా టిప్పర్ ఢీకొట్టింది. బైక్‌పై వెనుక కూర్చున్న దస్తగిరమ్మ ఎగిరి కింద పడడంతో టిప్పర్ ఆమె తలపై నుంచి వెళ్లింది. ప్రమాదంలో దస్తగిరమ్మ తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది. భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఘనంగా బిర్సాముండా జయంతి

నంద్యాల(న్యూటౌన్): భారతీయ అటవీజాతుల స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా జయంతి ఉత్సవాలను శుక్రవారం పట్టణంలోని శ్రీరామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. బిర్సాముండా 19వ శతాబ్దపు చివరి రోజుల్లో ఉద్యమానికి సారథ్యం వహించారన్నారు. 22 ఏళ్ల వయస్సులోనే బ్రిటీష్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించినట్లు తెలిపారు. చిన్న వయస్సులోనే అనేక పోరాటాలు చేసి జైలు శిక్షఅనుభవించారన్నారు. 1900 జూన్ 9న తుది శ్వాస విడిచినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు కళాశాలలో జాతీయ గౌరవ దివస్ ఉత్సవాలు నిర్వహించి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కేజీబీవీ సుబ్బయ్య, మేనేజర్ ప్రగతిరెడ్డి పాల్గొన్నారు.

18న కనకదాస జయంతి ఉత్సవం

నంద్యాల(అర్బన్): స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కార వ్యవస్థ ఆడిటోరియంలో ఈనెల 18న కనకదాస జయంతి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారిణి చింతామణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఉత్సవాల్లో జిల్లా ప్రజలు పాల్గొనాలని కోరారు.

సస్పెన్షన్ కాలాన్ని రెగ్యులర్ చేయాలి

కర్నూలు సిటీ: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డి పల్లె ఉన్నత పాఠశాలలో పది పరీక్షల విషయంలో జరిగిన ఘటనలో టీచర్ల సస్పెన్షన్ కాలాన్ని రెగ్యులర్ చేయాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకోవాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు శుక్రవారం డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా చైర్మెన్ ఎస్.గోకారి మాట్లాడుతూ.. కోర్టు ఉత్తర్వుల మేరకు సంబంధిత టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. అలాగే డీఈఓ ఆఫీస్‌లో పెండింగ్‌లో ఉన్న ఎన్ఓసీలు, మెడికల్ బిల్లుల విచారణలను వేగవంతం చేయాలని కోరారు. ఫ్యాప్టో సభ్యులు శివయ్య, శ్రీనివాసులు, రంగన్న, మౌలాలి, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దొర్నిపాడు: దొర్నిపాడు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం మరమ్మతు పనులు చేపట్టనున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రామ్మోహన్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పంటలసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గోస్పాడు: అకాల వర్షాల కారణంగా ప్రధాన పంట అయిన వరి, ఇతర పంటల్లో రైతులు సస్యరక్షణ, పోషకాల యాజమాన్యం, మెలకువలు పాటిస్తే నష్టాన్ని నివారించుకోవచ్చని వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రైతులు పంట కోత అనంతరం ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలన్నారు. వర్ష ప్రభావం తగ్గే వరకు పంటకోతలు చేపట్టరాదని, వర్షాలు తగ్గిన వెంటనే పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించుకోవాలన్నారు. వరిపైర్లు గాలికి నేలవాలితే దుబ్బులను పైకి కట్టాలని సూచించారు. పడిపోయిన చేలల్లో పాముపాడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున లీటరు నీటికి 2 ఎంఎల్ హెక్సాకొనజోల్ లేదా 2 ఎంఎల్ వాలిడా మైసిన్ లేదా ఒక ఎంఎల్ ప్రొఫికొనజోల్ లేదా 0.4 గ్రాములు ట్రై ప్లాక్సీ స్ట్రోబిన్ 25 శాతం, టేబుకొనజోల్ 50 శాతం కలిపి పిచికారీ చేయాలన్నారు. గింజ గట్టిపడే దశలో, కోతకు సిద్ధంగా ఉన్న వరి పొలాల్లో పైరు పడిపోతే గింజ మొలకెత్తకుండా ఉండటానికి లీటరు నీటికి 50 గ్రాముల కల్లు ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ఆయా పైర్లకు సంబంధించిన విషయాలపై రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.